ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# మన ప్రజాప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :137 శుక్రవారం మార్చి 13 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## గ్యాస్ కొరత అపోహలు వద్దు...
## మోదీ హెచ్చరిక

•ఇరాన్ యుద్ధం ప్రభావంపై కేంద్రం అప్రమత్తం
•అపోహలు వ్యాప్తి చేసే వారిపై నిఘా
•సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమని ధీమా



న్యూఢిల్లీ, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): ఇరాన్‌లో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితిని అతిశయోక్తిగా చూపిస్తూ భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై నిఘా ఉంచాలని మంత్రులను ఆయన ఆదేశించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని ప్రధాని మోదీ మంత్రులకు సూచించారు. ఈ అంశంపై ప్రజల్లో అపోహలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరిగే అవకాశాలు ఉన్నందున మంత్రులు కూడా అక్కడ చురుగ్గా ఉండాలని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కూడా ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఇలాంటి సంక్షోభ సమయంలో ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచాన్ని ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడినా భారత్ దానిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి బలంగా ఉందని ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఇదిలావుండగా, అంతర్జాతీయ నౌకా రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి అంశంపై కూడా భారత్ పురోగతి సాధించింది. ఈ సముద్ర మార్గం ద్వారా నౌకల



రాకపోకలకు సంబంధించిన అంశంపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఇరాన్ ప్రతినిధి అబ్బాస్ అరఘ్చితో చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం భారత జెండా కలిగిన ట్యాంకర్లకు హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణానికి ఇరాన్ అనుమతి ఇచ్చింది. ఇప్పటికే కొన్ని భారతీయ ట్యాంకర్లు ఆ మార్గం ద్వారా సురక్షితంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం. దీంతో ముడి చమురు రవాణాపై ఉన్న ఆందోళనలు కొంతవరకు తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.

## ఇంధన ధరల పెంపుపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం

+గ్యాస్ నింపే కేంద్రాల వద్ద నిరసన
+ఎరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయిన డ్రైవర్లు
+ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆటో డ్రైవర్లు



హైదరాబాద్, మార్చి 12 (మన ప్రజాప్రతినిధి) : హైదరాబాద్ నగరంలో పెరుగు తున్న ఇంధన ధరల పై ఆటో డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిఎన్‌జి, ఎల్పీజీ ధరలు పెరగడంతో తమకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోతున్నారు. గ్యాస్ నింపే కేంద్రాల వద్ద ఆటో డ్రైవర్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా కొందరు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ పెరిగిన ఇంధన ధరల కారణంగా రోజువారీ ఆదాయం తగ్గిపోతుందని చెప్పారు. గ్యాస్ ధరలు పెరగడంతో వాహనం నడపడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. కుటుంబాలను పోషించడం కూడా కష్టమవుతోందని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఇంధన ధరల పెంపును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. డ్రైవర్ల శాపాలతో ప్రభుత్వం నడవదని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వాలు వచ్చి వెళ్లాయని, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు అన్నారు.



## వెలుగుమట్ల బాధితుల ఆందోళన



❐పునరావాస కేంద్రం నుంచి ఖాళీ చేయిస్తున్నారన్న ఆరోపణ
❐పట్టాల జాబితాలో పేర్లు లేవని బాధితుల వేదన
❐ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్న బాధిత కుటుంబాలు

ఖమ్మం, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన బాధితులు తమను ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు కోల్పోయిన వారు తాత్కాలిక పునరావాసంగా అంబేద్కర్ భవన్లో నివసిస్తుండగా, ఇప్పుడు అక్కడి నుంచి కూడా ఖాళీ చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు వచ్చి భవనాన్ని ఖాళీ చేయాలని చెప్పడంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాల జాబితాలో అర్హులైన తమ పేర్లు లేకపోవడంతో బాధితులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తాము అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పట్టాల జాబితాలో చోటు కల్పించలేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఇల్లు కోల్పోయి కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇప్పుడు పునరావాస కేంద్రం నుంచి కూడా వెళ్లిపోవాలని చెప్పడం తమను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోందని అన్నారు. అంబేద్కర్ భవన్లోనే కొంతకాలంగా ఆశ్రయం పొందుతున్నామని, ఇప్పుడు అక్కడి నుంచి కూడా పంపిస్తే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలని, అర్హులైన వారందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని బాధిత కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి

## విలువలు, విశ్వసనీయతకు వైఎస్సార్ కాంగ్రెస్ కట్టుబడి ఉంటుంది జగన్

-తాడేపల్లిలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
-పార్టీ జెండా ఆవిష్కరించిన జగన్
-కార్యకర్తలే పార్టీ బలం అని వ్యాఖ్య

అమరావతి, మార్చి 12 (మనప్రజాప్రతినిధి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతకు కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి జగన్ మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ప్రజల నుంచి ఉద్భవించిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని జగన్ పేర్కొన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కలిసి కుట్రలు చేసి పార్టీని బలహీనపర్చేందుకు ప్రయత్నించాయని అన్నారు. అయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన అండదండలతో పార్టీ అధికారంలోకి వచ్చి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిందని తెలిపారు. పార్టీ కష్టకాలంలో కూడా వెనక్కి తగ్గకుండా నిలబడిన కార్యకర్తలే పార్టీకి నిజమైన బలం అని జగన్ చెప్పారు. పార్టీపై నమ్మకం ఉంచి, అధినేతపై విశ్వాసంతో నిలిచిన కార్యకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ 11 సంవత్సరాల రాజకీయ ప్రయాణం కేవలం రాజకీయ ప్రయాణం మాత్రమే కాదని, లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు ఇది నిదర్శనమని జగన్ పేర్కొన్నారు





## ప్రేమ పేరుతో మైనర్ బాలికలపై దారుణం

-ఇంటర్ విద్యార్థి మోసం బయటపడిన ఘటన
-బాలిక గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి
-ఆస్పత్రిపై కూడా విచారణకు ఆదేశాలు



నాగర్‌కర్నూలు, మార్చి 12 (మన ప్రజాప్రతినిధి): ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేసిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో కలకలం రేపింది. కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థి పలువురు బాలికలను ప్రేమ పేరుతో లొంగదీసుకుని వారిపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఒక బాలిక గర్భం దాల్చడంతో విషయం బయట పడింది. బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమాచారం ప్రకారం జిల్లాకు చెందిన ఆ ఇంటర్ విద్యార్థి పరిచయమైన మైనర్ బాలికలను ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఈ క్రమంలో ఒక బాలిక గర్భం దాల్చినట్లు తెలిసింది. అనంతరం ఆమెను కొల్లాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి గర్భస్రావం చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందిత విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అతని మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా పలువురు బాలికలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలావుండగా బాలికకు గర్భస్రావం చేసినట్లు ఆరోపణలు ఉన్న కొల్లాపూర్‌లోని సాయి కృప ఆస్పత్రిపై కూడా అధికారులు దృష్టి సారించారు. ఈ వ్యవహారంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

# రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో మరో మృతి

**-చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి**
**-మృతుల సంఖ్య 14కు పెరుగుదల**
**-ఇంకా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు**



అమరావతి, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనలో మరొకరు మృతి చెందారు. స్వరూప్‌నగర్‌కు చెందిన బండారు వీరలక్ష్మి (60) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య 14కు చేరింది. ఇటీవల ఒక బాలిక కూడా చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన రామలక్ష్మి (73) అనే వృద్ధురాలు కూడా గతంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. ఫిబ్రవరి 22 నుంచి రాజమహేంద్రవరం లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరనగర్, స్వరూపనగర్ ప్రాంతాలకు చెందిన పలువురు నివాసితులు అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, కడుపు నొప్పి, మూత్రపిండాల వైఫల్యం వంటి సమస్యలతో బాధితులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మరికొందరు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

# పెడకాకాని రైల్వే స్టేషన్‌లో హత్య కేసు ఛేదనం

**-గ్యాంగ్ లీడర్‌ను ముఠా సభ్యులే హతమార్చిన ఘటన**
**-చోరీ సొత్తు పంపకాలపై తలెత్తిన వివాదం**
**-సీసీ కెమెరాలు, ఫోన్ కాల్స్‌తో పోలీసులు కేసు ఛేదన**



గుంటూరు, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): గుంటూరు జిల్లా పెదకాకాని రైల్వే స్టేషన్‌లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేరళకు చెందిన పరమడం అనీష్ అలియాస్ బ్లేడ్‌ను అతని ముఠా సభ్యులే హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. రైల్వే స్టేషన్లలో చోరీలకు పాల్పడే ఈ గ్యాంగ్‌లో తమిళనాడుకు చెందిన కుమార్, కేరళకు చెందిన దీపేష్, అనంతపురానికి చెందిన వెంకటేష్ సభ్యులుగా ఉన్నారు. ప్రయాణికుల జేబులు కత్తిరించడం, చోరీలు చేయడం ఈ ముఠా ప్రధాన కార్యకలాపాలుగా ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ ముఠాకు నాయకుడిగా ఉన్న అనీష్ దొంగతనం చేసే సమయంలో ఎవరైనా అడ్డుకుంటే వారిపై బ్లేడ్‌తో దాడి చేయడం వల్ల అతనికి 'బ్లేడ్' అనే పేరు వచ్చింది. చోరీల ద్వారా వచ్చిన డబ్బును సభ్యుల మధ్య పంచుకునేవారు. అయితే ఇటీవల కాలంలో ముఠా నాయకుడైన అనీష్ చోరీ సొమ్ములో ఎక్కువ భాగం తనకే ఇవ్వాలని మిగతా సభ్యులపై ఒత్తిడి తీసుకువస్తున్నాడు. అదనంగా బెదిరింపులకు కూడా దిగుతున్నాడు. ఈ పరిస్థితులతో విసిగిపోయిన మిగతా ముగ్గురు సభ్యులు అతన్ని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. మార్చి నాలుగో తేదీన ముగ్గురు సభ్యులు గుంటూరుకు వచ్చి అనీష్‌ను సంప్రదించారు. అందరం కలిసి మద్యం సేవిద్దామని చెప్పి అతన్ని పెదకాకాని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత పెదకాకాని రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. ఆ సమయంలో అనీష్ మద్యం మత్తులో ఉండటాన్ని గమనించిన ముగ్గురు అతనిపై దాడి చేశారు. ముందుగా బండరాయితో తలపై బలంగా కొట్టి, అనంతరం గొంతు కోసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. తొలుత మృతుడు బీహార్‌కు చెందిన వ్యక్తి అని భావించినప్పటికీ తరువాత ఆధారాల ఆధారంగా అసలు వివరాలను గుర్తించారు. అనంతరం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రైల్వే డీఎస్పీ అక్కేశ్వరరావు తెలిపారు. చోరీ సొత్తు పంపకాలపై తలెత్తిన వివాదమే ఈ హత్యకు కారణమని ఆయన వెల్లడించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఆయన అభినందించారు.

# ఇంధన సరఫరాపై ఆందోళనలు

**-హోర్ముజ్ జలసంధి మూసివేతతో సంక్షోభం**
**-సిలిండర్ల కొరతతో రెస్టారెంట్లు మూత**
**-పెట్రోల్ పంపుల వద్ద వాహనదారుల క్యూలు**




న్యూఢిల్లీ, మార్చి 12 (మనప్రజాప్రతినిధి) : మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముడి చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాలపై ఈ యుద్ధం ప్రభావం గట్టిగా పడింది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రపంచంలో అత్యంత కీలకమైన సముద్ర మార్గంగా భావించే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ముడి చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం భారత్ సహా అనేక ఆసియా దేశాలపై పడింది. దిగుమతులు తగ్గిపోవడంతో ఎల్పీజీ సిలిండర్ల కొరత తలెత్తింది. దీంతో ఇంధన సరఫరాపై ప్రజల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు రవాణాలో ఇరవై శాతానికి పైగా హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా జరుగుతుంది. ఈ మార్గం మూసివేయడంతో ముడి చమురు తీసుకువెళ్తున్న నౌకలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగాయి. సరఫరా గొలుసు కూడా దెబ్బతింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని ముందస్తు చర్యలు తీసుకుంది. దేశీయ అవసరాల కోసం ఉన్న ఎల్పీజీ సిలిండర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని చమురు కంపెనీలకు సూచించినట్లు సమాచారం. అదే సమయంలో హోటళ్లు, పరిశ్రమలకు ఉపయోగించే వాణిజ్య సిలిండర్ల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. సిలిండర్ల కొరత ప్రభావం ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. తమిళనాడు రాజధాని చెన్నైతో పాటు పలు జిల్లాల్లో వంట గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో అనేక రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. పనిచేస్తున్న కొన్ని హోటళ్లలో కూడా మెనూలోని అనేక వంటకాలను తొలగించారు. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో కొందరు వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రజలు కూడా ఎలక్ట్రిక్ స్టవ్‌లు, కట్టెల స్టవ్‌లను కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇక ఇంధన కొరతపై పుకార్లు కూడా ప్రజల్లో ఆందోళనను పెంచుతున్నాయి. పెట్రోల్, డీజిల్ సరఫరా కూడా ప్రభావితం కావచ్చనే భయంతో చెన్నై సహా తమిళనాడులోని అనేక ప్రాంతాల్లో పెట్రోల్ పంపుల వద్ద వాహనదారులు పొడవైన క్యూలలో నిలబడుతున్నారు. కొందరు తమ వాహనాలకు మాత్రమే కాకుండా అదనంగా నీటి డబ్బాలు, బకెట్లలో కూడా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన లభ్యతపై భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళనలు తగ్గడం లేదు. పరిస్థితి కొనసాగితే నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, రవాణా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# పెట్టుబడులను ఆకర్షించండి

**-పెట్టుబడుల కోసం కలెక్టర్లకూ బాధ్యత: సీఎం చంద్రబాబు**
**-పెట్టుబడుల ఆకర్షణకు 'మూడు సీ' ఫార్ములా**
**-కలెక్టర్ల పనితీరుకు ర్యాంకులు ప్రకటింపు**
**-విశాఖ, అమరావతి, తిరుపతి ప్రత్యేక ఆర్థిక ప్రాంతాలు**



అమరావతి, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం కేవలం పరిశ్రమల శాఖ బాధ్యత మాత్రమే కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇకపై జిల్లా కలెక్టర్లు కూడా పెట్టుబడుల సాధనలో పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. పెట్టుబడిదారులను గుర్తించడం, వారిని ఒప్పించడం, వారికి అవసరమైన సహకారం అందించడం కోసం 'కమిట్‌మెంట్, కన్విన్స్, కోఆపరేట్' అనే మూడు సీ ఫార్ములాను అమలు చేయాలని ఆయన తెలిపారు. పెట్టుబడుల విషయంలో జిల్లా కలెక్టర్ల పనితీరును అంచనా వేసి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఆధారంగా ర్యాంకులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అమరావతిలో జరిగిన ఆరవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు పెట్టుబడులు, పర్యాటక రంగాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగితేనే స్థానికంగా ఉపాధి అవకాశాలు విస్తరించి ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు త్వరగా కార్యరూపం దాల్చేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ప్రత్యేక ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామికాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఓర్వకల్లు, కొప్పర్తి వంటి ప్రాంతాలను ప్రధాన పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పరిశ్రమలు స్థాపించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను అమలు చేస్తున్నామని వివరించారు. ఇక గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదని చంద్రబాబు విమర్శించారు. అమర్ రాజా వంటి సంస్థలను కూడా వేధింపులకు గురిచేసి రాష్ట్రం నుంచి వెళ్లేలా చేశారని ఆరోపించారు. గతంలో హైదరాబాద్‌ను నివసించడానికి అనువైన నగరంగా, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దినట్లు గుర్తు చేశారు. అదే విధంగా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులకు అనుకూలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.




# ఎల్పీజీ కొరతపై ప్రధాని స్పందించాలి

**-పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ డిమాండ్**
**-మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలపై విమర్శలు**
**-గ్యాస్ కొరతపై తక్షణ చర్యలు కోరిన చామల**
**-చామల కిరణ్ కుమార్ రెడ్డి**




న్యూఢిల్లీ, మార్చి 12 (మనప్రజాప్రతినిధి): దేశంలో ఎల్పీజీ కొరతపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ స్పందించాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పటికీ మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధాని స్పందించడం లేదని ఆయన విమర్శించారు. దేశంలో ఇంధన సరఫరా పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ ఇంధన మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో గ్యాస్ సరఫరాపై ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయని అన్నారు. అయితే ఈ కీలక అంశంపై ప్రధాని ఇప్పటివరకు మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారనే విమర్శలు కూడా చేశారు. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశంలో ఎల్పీజీ కొరతను త్వరగా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# గ్యాస్ కోరత లేకుండా చూడాలి...!

**వంట గ్యాస్ ను బ్లాక్ చేసిఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకోవాలి...!**



హుస్నాబాద్ మార్చిమన ప్రజాప్రతినిధి: ఇతర దేశాలయుద్ధంతో వంటగ్యాస్ ను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని హుస్నాబాద్ పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద హుస్నాబాద్ బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట గ్యాస్ ను ఆన్ లైన్ లో బుకింగ్ చేస్తే సర్వర్ బిజీ తో గంటల గడిచినా బుకింగ్ కావడం లేదని, ప్రజలు ఆవేదన చెందుతున్నారని, కేంద్రప్రభుత్వం ఎలాంటి గ్యాస్ కోరతలేదని ప్రకటనలు చేస్తుంది కానీ, పట్టణాల్లో ఆన్ లైన్ లో గ్యాస్ బుకింగ్ కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు గృహ, వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందకపోవడంతో దీనిని ఆసరాగా తీసుకొని దళారీలు ఎల్ పిజిని బ్లాక్ చేసి ఎక్కువ ధరలకు అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు. ఈ నిరసనలో మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మన ప్రజాప్రతినిధి దినపత్రిక



# పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ




అక్కన్నపేట.మండల్ మార్చి. మనప్రజాప్రతినిధి. 12:పంతులు తండ సర్పంచ్ లావుడ్య చిన్న నాయక్ గారు అక్కన్నపేట జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ ఇస్తూ, పరీక్షల సమయంలో రవాణా సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు."పదవ తరగతి విద్యార్థులారా, మీరు మీ భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఈ పరీక్షలు ఒక అవకాశం. మీరు కష్టపడి పనిచేసి, మీ లక్ష్యాలను సాధించండి. మేము మీకు అండగా ఉన్నాము అంటు వారిలో ధైర్యాన్ని నింపారు.పరీక్షల సమయంలో మీకు రవాణా సౌకర్యం కల్పించడానికి మేము ఏర్పాట్లు చేసాము. మీరు పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి మరియు తిరిగి రావడానికి నా చార్జీలను నేనే భరిస్తానని మాటిచ్చారు.మీ లక్ష్యం వైపు మీ దృష్టిని సారించండి అంటూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు.మీరు మీ కలలను నిజం చేసుకోవడానికి మేము మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామంటూ ,మీ తల్లిదండ్రులకు పేరు కీర్తి తీస్కరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరీరామ్ గారు,జగ్మాల్ గారు ,నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

# దేవాలయ నిర్మాణానికి విరాళం




మేడ్చల్ జిల్లా, మార్చ్ 12 ( మనప్రజాప్రతినిది ):మేడిపల్లి డివిజన్ సాయిప్రియ నగర్ శ్రీ సీతారామ స్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసిన తుంగతుర్తి రవి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి పరిధిలోని సాయి ప్రియ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ స్వామి (శివాలయం & రామాలయం) దేవాలయ నిర్మాణ పనుల కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి విరాళాన్ని అందచేశారు.గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలిసారు , ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ. 1,00,116/- (లక్షా నూట పదహారు రూపాయలు) అందజేశారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి గారు మాట్లాడుతూ:"దైవ చింతన సమాజంలో శాంతిని, ఐకమత్యాన్ని పెంపొందిస్తుంది. సాయిప్రియనగర్ ప్రాంత భక్తుల చిరకాల వాంఛ అయిన ఈ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్ వి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుంది," అని పేర్కొన్నారు.తమ పిలుపు మేరకు స్పందించి, ఆలయ అభివృద్ధికి సహకరించినందుకు దేవస్థాన కమిటీ సభ్యులు తుంగతుర్తి రవి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ సోషల్ మీడియా వారియర్ కి జన్మదిన శుభాకాంక్షలు



నేరేడుచర్ల :( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )ఉమ్మడి నల్లగొండ జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు బచ్చలకూరి నాగశేఖర్ జన్మదిన వేడుకలు హుజూర్ నగర్ నియోజకవర్గం, నేరేడుచర్ల పట్టణ పార్టీ ఆఫీస్ లో కేక్ కట్ చేయించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నరసింహారావు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు విరివిగా...ప్రజలకు అందించే ప్రక్రియలో సోషల్ మీడియా వారియర్స్ ని భాగస్వామ్యం చేస్తూ, తనదైన శైలిలో ముందుకు కొనసాగుతున్నాందుకు సేవలను గుర్తించి నేటి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఇదే సందర్భంగా...ఈరోజు హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షుడు., టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీ.గెల్లి శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మరియు హైదరాబాదులోని గచ్చిబౌలి, రాయదుర్గం లోని బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ దినేష్ చౌదరి అన్న కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి , దినేష్ చౌదరి ఆశీస్సులు పొందినట్లు..మునుముందు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో. హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి లంకెపల్లి నాగార్జున మరియు మాజీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు లావుడ్య శ్రీను నాయక్, మండల దీ=హా సోషల్ మీడియా సభ్యులు నందిపాటి సోమయ్య చిన్నపంగు పుల్లయ్య అమరవరపు రవి, మిడతపల్లి శీను, పోలగాని భరత్ కుమార్ గౌడ్,కొత్త నాగయ్య, మాతంగి శ్రీను, పగిడి బాలరాజు, తదితరులు ఉన్నారు.

# కొమ్మూరి ఆధ్వర్యంలో ఇందిరమ్మండ్ల ప్రారంభోత్సవం

మనప్రజాప్రతినిధి//తరిగొప్పుల,జనగామ:జనగామనియోజకవర్గం,తరిగొప్పుల మండల అధ్యక్షులు వగలబోయిన యాదగిరి గౌడ్,ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షులు పండుగ కనకయ్య అధ్యక్షతన ఈరోజు తరిగొప్పుల మండల కేంద్రంలోని జగ్గయ్యపేట,ఎన్నానాయక్ తండ లో ఇందిరమ్మఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, మరియు కొమరవెల్లి దేవస్థాన చైర్మన్ గంగం నరసింహారెడ్డి.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,ఆధ్వర్యంలో మంజూరైనటువంటి ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఈసందర్భంగా గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికి మరియు కొమ్మూరి ప్రతాపరెడ్డి కి కృతజ్ఞతలు తెలపడం జరిగినది.ఈ కార్యక్రమంలో తరిగొప్పుల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు,యువజన నాయకులు,కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ




నేరేడుచర్ల( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి ఆధ్వర్యంలో రాజీవనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డిపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాల విద్యార్థులకు క్రీడా సామ్రగ్రి పంపిణీ గుండ్రెడ్డి సైదిరెడ్డి వారి మనమడు సాయాన్ష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుమారు రు 2500 రూపాయలతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం గుండ్రెడ్డి సైదిరెడ్డి మరియు డిస్టిక్ చైర్ పర్సన్ మధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు మంచిగా ఆటలు ఆడుకొని మంచి ఫలితాలను తీసుకురావలసిందిగా పిల్లల భవిష్యత్తు కొరకుఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చిలకరాజు శ్రీను,గంధం షావయ్య,పాఠశాల ఉపాధ్యాయురాలు కందుకూరి అనసూర్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల వీడ్కోలు సమావేశం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట, మార్చి 12,:మెదక్ జిల్లా, చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. లతంబర్ రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పదో తరగతి అనేది ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని ఆయన పేర్కొన్నారు. ఈ దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉజ్వలంగా, బలంగా ఉంటుందని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నతమైన ఆలోచనలతో ముందడుగు వేయాలని సూచించారు. పాఠశాలలో నేర్చుకున్న విద్య, విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని కోరారు. విజయాలు సాధించినప్పుడు వినయంగా ఉండాలని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడికి వెళ్లినా ఇబ్రహీంపూర్ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పరంధామయ్య, వెంకటేష్, మహేందర్ రెడ్డి, బాల్ నరసయ్య, గీత, నరేష్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు గుండమైన నవీన్, చాకలి శ్యామల, కుమ్మరి రాజు, సుమలతతో పాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పాదయాత్ర విజయవంతానికి బీజేపీ సమావేశం



హుస్నాబాద్ మార్చి మన//ప్రజా //ప్రతినిధి:హుస్నాబాద్ రూరల్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు భూక్య సం జపత్ నాయక్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది....కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీ మరియు సర్పంచ్, వార్డ్ మెంబర్ ఎన్నికల విజయోత్సవం సందర్భంగా కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పాదయాత్ర చేసి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటామని ఇచ్చిన మాట మేరకు ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ శక్తిపీఠం నుండి కొండగట్టు వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు ఈ పాదయాత్రలో గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బండి సంజయ్‌తో కలిసి పాదయాత్రగా వెళ్లి అంజన్న స్వామిని దర్శించుకోవాలని నిర్ణయించారు ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి బూత్ నుండి కనీసం 20 మందికి తగ్గకుండా కరీంనగర్‌కు చేరుకొని పాదయాత్రలో చురుకుగా పాల్గొనాలని గ్రామ శక్తి కేంద్ర ఇన్చార్జిలకు, బూత్ అధ్యక్షులకు మరియు సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్‌లుగా పోటీ చేసిన అభ్యర్థులకు సూచనలు చేశారు ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు. వెల్దండి రాజేంద్రప్రసాద్ సీనియర్ నాయకులు భూతగడ్డపు బాలరాజు మంద మహేశ్వర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రత్నాకర్ రెడ్డి కన్నె శంకర్ నెల్లి శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు కొలిపాక కిరణ్ బాలరాజు బొల్లి సుధాకర్ గుగులోతు రాములు బాసబత్తిని మధుసూదన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు

# మహిళ సమైక్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మన ప్రజ ప్రతినిధి తెలుసు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 12: చేగుంట మండల కేంద్రంలో మహిళ సమాఖ్య కార్యాలయం లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల మహిళా సమాఖ్య, ఆధ్వర్యంలో,వివిధ బ్యాంకు మేనేజర్ ఎం ఎస్ వారి సౌజన్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు, మండలం లో ఉన్న వివిధ గ్రామ సంఘం అధ్యక్షురాలు, విఓఏ లు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనగా ఈ వీరికి జిల్లా అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి చేతుల మీదిగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు, ఈకార్యక్రమంలో డిపిఎం బ్యాంక్ లింకేజి బాలరాజ్,, మండల సమైక్య పాలకవర్గం, ఎఫ్ పి సి పాలకవర్గం, ఏపిఎం, సీసీ లు, ఎంఎస్ఏ, ఎంఎస్ఓ, ఎఫ్ పి సి సీఈఓ, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.





# మాజీ ఎంపీపీ సబితా కుటుంబాన్ని పరామర్శించిన



-తెలంగాణ మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చి 12 :మెదక్ జిల్లా, నార్సింగి మండల తాజా మాజీ ఎంపీపీ, మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు చిందం సబితా భర్త,రవీందర్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తమరావు గురువారం చేగుంటలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి తగిన ధైర్యం కల్పించడంతో పాటు, సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో ఆయన వెంట సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి దేమే యాదగిరి పటేల్, అది సురేందర్ పటేల్, చల్లా లక్ష్మణ్, మెదక్ కోఆర్డినేటర్ వీర్ కుమార్ తదితరులు ఉన్నారు.

# నిషేధిత గుట్కా అమ్మకాలపై సూర్యాపేట పోలీస్ ఉక్కుపాదం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం రూ.15 వేల విలువైన నిషేధిత హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు, హుక్కా వెపర్ స్వాధీనం.వస్త్ర దుకాణాల్లో అమ్మకాలు చేస్తున్న వ్యాపారులపై మూడు కేసు నమోదు.ప్రజల ఆరోగ్యాలను హరించే వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు అని సూర్యాపేట జిల్లా కె. నరసింహ ఐపిఎస్ గారు హెచ్చరించారు.నమ్మదగిన సమాచారం మేరకు సూర్యాపేట పట్టణ పోలీసులు సూర్యాపేట పట్టణం మెయిన్ రోడ్ నందు గల ఆర్.వి ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ ఫ్యాషన్స్ వస్త్ర దుకాణాల నందు హుక్కా అమ్మకాలు నిర్వహిస్తున్నారు అనే సమాచారంపై పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించగా 15వేల రూపాయల విలువైన నిషేధిత హుక్కా ప్యాకెట్లు, హుక్కా వెపర్ లు దొరికనైనది అని ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు తెలిపినారు. దీనికి సంభందించి ముగ్గిరిపై కేసు నమోదు చేయడం జరిగినది అన్నారు. నిషేధిత హుక్కా వెపర్ సేవించడం వల్ల క్యాన్సర్ సంభంద వ్యాధులు వస్తాయి, ప్రజల ఆరోగ్యాలను హరించే ఇలాంటి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు, దీనిని సేవించడం వల్ల ఆరోగ్యాలు నాశనం అవుతాయని అన్నారు. యువత ఇలాంటి చెడు అలవాట్లకు లోనుకావొద్దు అని తెలిపారు. ఇలాంటి అమ్మకాలకు సంబంధించిన సమాచారం పోలీసు వారికి తెలియజేయాలని కోరారు

# ఎగ్జిబిషన్‌ను వీక్షించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఫోటోలనుగురువారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ కన్వెన్షన్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో డిపిఆర్ఓ వల్లోజి శ్రీనివాసరావు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను వారు పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి అవగాహన కల్పించేలా ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగింది.ఎగ్జిబిషన్ ఏర్పాట్లలో సీనియర్ అసిస్టెంట్ పి. సుధాకర్, రికార్డు అసిస్టెంట్ అనిల్ కుమార్, డ్రైవర్ రహీం, అశోక్, నరేష్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, సీఈఓ జడ్పీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# 'మనప్రజా ప్రతినిధి' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బీజేపీ జిల్లా కార్యదర్శి కర్నే హరీష రేవంత్



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల మార్చి, 12:సమాజ శ్రేయస్సు కోసం వార్తా సంస్థలు నిరంతరం కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కర్నే హరీష అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 'మన ప్రజా ప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యొక్క నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆమె ఘనంగా ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా కర్నే హరీష రేవంత్, మాటాడుతూ.. 'మన ప్రజా–ప్రతినిధి' పత్రిక యాజ మాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. తన చేతుల మీదుగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషం గా ఉందని పేర్కొన్నారు.పత్రికలు మరియు టీవీ ఛానళ్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలని, ప్రజల గొంతుకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.మీడియా రంగంలో 'ప్రజా ప్రతినిధి' సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.పత్రిక అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 'ప్రజా ప్రతినిధి' జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పులి మల్లేశం, టౌన్ రిపోర్టర్ శ్రీనివాస్ మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాఫ్ట్ సర్వే ను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 12,:యాసంగి పంటల నమోదు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండాలనే ఉద్దేశ్యంతో చందాయిపేట్ క్లస్టర్ వ్యవసాయ అధికారిని భువనేశ్వరి చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామం లో నిర్వహిస్తున్నటువంటి డిజిటల్ క్రాఫ్ట్ సర్వేను మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్,డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు, అనంతరం, ఏ,ఈ,ఓ వ్యవసాయ వాలెంటర్ ను పలు సూచనలు ఇస్తూ ప్రతి వ్యవసాయదారుడి . భూమి వద్ద 25 మీటర్ల దూరంలో ఉండి,పంట ఫొటోలను, యాప్లో అప్లోడ్ చేయాలని, గ్రామం లో ఉన్న ప్రతి పొలాన్ని సందర్శించి, పంట వివరాలను నమోదు చేయాలని ఏ ఈ ఓ, భువనేశ్వరి,వారి సిబ్బందికి సూచించారు, ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు,అన్నం కుమార్, అప్పల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



హుస్నాబాద్ మార్చి //మన ప్రజ// ప్రతినిధి.12): హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మీ , కమిషనర్ మల్లికార్జున్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిశుభ్రత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి హాజరయ్యారు. పట్టణ ప్రజలు,మెప్మా రిసోర్స్ పర్సన్స్, సానిటేషన్ సిబ్బంది తో కలిసి మార్కెట్ ను శుభ్రపరచి, చెత్తను డంప్ యార్డ్ కు తరలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మెప్మా ాణవీజ సంతోషి మాత,పర్యావరణ అధికారి రవికుమార్,జవాన్ లు సారయ్య,ప్రభాకర్, మెప్మా రిసోర్స్ పర్సన్స్,శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమకారుల త్యాగాలను మరిచిన ప్రభుత్వాలు



నేరేడుచర్ల: (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన మిలియన్ మార్చి సంఘటన మార్చి 10 నాటికి 15 ఏళ్లు పూర్తయ్యాయని, కానీ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వాలు గుర్తించడం లేదని మలిదశ ఉద్యమకారుడు గోపగాని మారయ్య గౌడ్ అన్నారు. గురువారం నాడు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల గుండెల్లో జ్వాలలు రగిలించిన ఘట్టం మిలియన్ మార్చి అని,ఆనాటి రోజులను గుర్తు చేసుకుని తెలంగాణ ఉద్యమ సారధి మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సారథ్యంలో నాటి నాయకులు నేటి మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి నాయకత్వంలో వారు పిలుపు ఇవ్వడంతో లక్షల మంది తెలంగాణ ఉద్యమకారులు సాగర తీరానికి తరలివచ్చి మిలియన్ మార్చి సంఘటన చరిత్ర సృష్టించింది అన్నారు. నాటి పాలకుల నిర్బంధాలు అరెస్టులు అడ్డంకులు ఎంతవరకు వెనక్కి తగ్గకుండా తెలంగాణ కోసం పోరాడిన వారు నిజమైన తెలంగాణ ఉద్యమకారులని, ఆ మహా పోరాటంలో నేరేడుచర్ల మండలం నుండి నేను ఒక భాగస్వామి నై నాతోపాటు మండల పరిధిలోని ఎంతోమంది తెలంగాణ మలిదశ ఉద్యమకారులు తెలంగాణ స్వరాష్టం కోసం ఎన్నో త్యాగాలకు అరెస్టులకు గురికావడం జరిగింది. కానీ స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత వారికి కనీస గౌరవం కానీ ఉపాధి అవకాశాలకు కానీ ఈ ప్రభుత్వాలు కల్పించడం లేదు, నేడు వారి పరిస్థితి రోజు వారి కూలీలుగా కుటుంబ భారమై దీనస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారని, కొందరి ఆరోగ్య పరిస్థితి అత్యంత దీనంగా తయారయిందని తెలంగాణ ఉద్యమ సమయంలో వారు చేసిన త్యాగాలను గుర్తించి ఇంతవరకు సహాయం అందించకపోవడం చాలా బాధాకరంగా ఉందని ఆయన వాపోయారు, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు

# 'ప్రజాప్రతినిధి' పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మనప్రజాప్రతినిధి/ రాజన్న సిరిసిల్ల మార్చి ,12 :ప్రజల గొంతుకగా నిలుస్తున్న 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ క్యాలెండర్‌ను సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి ఘనంగా ఆవిష్కరించారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. సమాజంలో పత్రికా రంగం కీలక పాత్ర పోషిస్తుందని, 'ప్రజాప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యాజమాన్యం తమ క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యాజమాన్యానికి మరియు సిబ్బందికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఈ పత్రిక మరింత వృద్ధి చెంది, నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ మెరుగైన సేవలందించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలోపులి మల్లేశం (సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్)శ్రీనివాస్ (టౌన్ రిపోర్టర్)పలువురు పత్రికా ప్రతినిధులు మరియు నాయకులు